సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం । 6 । ఆగస్టు । 2024



రూ.2,25,612 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు కోకా పార్వతీ ప్రమీల శేషకుమారి, కుటుంబ సభ్యులు (కాకినాడ రూరల్ వలసపాకల) రూ.2,25,612 విరాళం సమర్పించారు.



రారండోయ్.. వేడుక చూద్దాం

అన్నవరంలో మంగళవారం జరిగే సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. దీంతో రత్నగిరికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది. 8లో

కడలిలోకి 6.33 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమ వారం రాత్రి 7 గంటలకు 6,33,226 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 3,800, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. ఎగువన భద్రాచలంలో ప్రవాహం క్రమేపీ తగ్గుతూండటంతో ధవళేశ్వరం వద్ద నీటి ఉధృతి మంగళవారం తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.

న్యూస్‌రీల్

గ్రీవెన్స్‌కు 150 అర్జీలు



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ సెల్) ద్వారా ప్రజల నుంచి 150 అర్జీలు స్వీకరించామని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. రెవెన్యూ 42, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి 26, హోం 25, వైద్య, ఆరోగ్యం 16, మున్సిపాలిటీ 10, ఇతర శాఖలకు సంబంధించి 41 అర్జీలు వచ్చాయని వివరించారు. వీటిలో 139 ఆన్‌లైన్‌లో, 11 ఆఫ్‌లైన్‌లో నమోదు చేశామని చెప్పారు. ఈ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్.కృష్ణానాయక్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 27 ఫిర్యాదులు



మహిళ సమస్య తెలుసుకుంటున్న అడిషనల్ ఏఎస్పీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఏఎస్పీ ఎస్ఆర్ రాజశేఖరరాజు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి 27 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించి, వారి సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో నేరుగా జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, ఫిర్యాదీల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. కుటుంబ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవా సంస్థకు పంపించి తగిన కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు.

రైతు సేవా కేంద్రాల్లో నష్టపోయిన రైతుల జాబితా



గ్రామసభలో మాట్లాడుతున్న మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: గత నెలలో కురిసిన అధిక వర్షాలతో పంట నష్టపోయిన రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల వద్ద ఉంచామని జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు తెలిపారు. ఆయా సేవా కేంద్రాల వద్ద రైతులు ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ తమ పేర్లు సరిచూసుకుని, అభ్యంతరాలుంటే తెలపాలని కోరారు. తొర్రేడు రైతు సేవా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభలో ఆయన మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మ వారికి రూ.1.29 కోట్ల ఆదాయం

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారికి ఆషాఢ మాసంలో రూ.1.29 కోట్ల ఆదాయం లభించిందని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, లోవ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. వేళంగి, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ గ్రేడ్-1 ఈఓలు ఎంఎం వీరభద్రరావు, ఎం.సూర్యమణి పర్యవేక్షణలో లోవ దేవస్థానంలో హుండీలను సోమవారం తెరచి నగదు లెక్కించారు. ఆషాఢ మాసం మొత్తం కలిపి చిల్లర నాణేలు రూ.1,68,004, నగదు రూ.51,93,956 వెరసి రూ.53,61,960 ఆదాయం లభించిందన్నారు. అలాగే లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.24,25,800, పులిహోర ప్రసాదాలకు రూ.4,54,760, పూజా రుసుములు రూ.18,21,250, కేశఖండన శాలకు రూ.1,89,930, వాహన పూజలకు రూ.46,330, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.11,27,000, జీఎస్టీ రూ.66,858, విరాళాలుగా రూ.14,25,277, శాశ్వత సేవలకు రూ.11,500 కలిపి మొత్తం రూ.1,29,37,665 ఆదాయం లభించిందని వివరించారు. గత ఏడాది ఆషాఢ మాసోత్సవాల కంటే ఈసారి ఆదాయం రూ.17 లక్షల అధికంగా వచ్చిందన్నారు. ఆషాఢం ఐదు వారాల్లో 4 లక్షల మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని విశ్వనాథరాజు వివరించారు. హుండీల నగదు లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

వరుణ ప్రతాపం

- రెండు నెలలు దంచి కొట్టిన వర్షాలు
- జూన్‌లో 69 శాతం, జూలైలో 51.4 శాతం అధికం
- ముంచెత్తిన వరదలు
- 11,572 హెక్టార్లలో దెబ్బ తిన్న పంటలు
- రైతులకు తీరని నష్టం



వరద నీరు.. కడలి పాలు: ధవళేశ్వరం ఆనకట్ట నుంచి సముద్రంలోకి విడిచిపెడుతున్న గోదావరి మిగులు జలాలు (ఫైల్)

కొవ్వూరు: ఈ ఏడాది సూర్యుడు ఎంతలా మండిపోయాడో.. వరుణుడూ అదే స్థాయిలో ప్రతాపం చూపించాడు. నైరుతి రుతు పవనాలు ముందుగానే వచ్చినా.. ప్రభావం చూపడానికి తొలుత కాస్త సమయం పట్టింది. ఉపరితల ఆవర్తన ద్రోణులు, అల్పపీడనాలు తోడవడంతో వరుణుడు క్రమంగా చురుకుదనం సంతరించుకున్నాడు. జూన్, జూలై నెలల్లో కుండపోత వర్షాలు కురిపించాడు. ఫలితంగా ప్రస్తుత ఖరీఫ్‌లో మొదటి రెండు నెలలూ జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో వర్షపాతం నమోదైంది. దీనికి గోదావరి, ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ వరదలు కూడా తోడయ్యాయి. ఇలా అన్ని విపత్తులూ ఒకేసారి చుట్టుముట్టడంతో రైతులు నిండా నష్టాల్లో మునిగారు. అప్పుడప్పుడే పోసిన వరి నారుమళ్లు, కాస్త ముందుగానే వేసుకున్న నాట్లతో పాటు వెదజల్లు సాగు చేపట్టిన చేలు దెబ్బ తిన్నాయి. అరటి వంటి ఉద్యాన పంటలు, కూరగాయ పాదులు దుంపనాశనమయ్యాయి. దీంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

రికార్డు స్థాయి వర్షపాతం

- జిల్లావ్యాప్తంగా జూన్, జూలై నెలల్లో కొద్ది మండలాలు మినహా మిగిలిన అన్నిచోట్లా అధిక వర్షపాతమే నమోదైంది.
- జూన్ నెలలో గోకవరం, బిక్కవోలు మినహా అన్ని మండలాల్లోనూ వానలు దంచి కొట్టాయి. గోకవరం మండలంలో సాధారణ వర్షపాతం నమోదైంది. బిక్కవోలులో మాత్రం సాధారణం కంటే 60 శాతం తక్కువ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన 17 మండలాల్లో అధిక వర్షాలు కురిశాయి. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 117 మిల్లీమీటర్లు కాగా, ఏకంగా 69 శాతం అధికంగా 198.3 మిల్లీమీటర్లు నమోదైంది.
- జూలై నెలలో రాజానగరం, రంగంపేట, బిక్కవోలు, అనపర్తి, పెరవలి మినహా మిగిలిన అన్ని మండలాల్లోనూ అత్యధిక వర్షపాతం నమోదైంది. సీతానగరం, నల్లజర్ల, దేవరపల్లి, తాళ్లపూడి, గోపాలపురం మండలాల్లో రికార్డు స్థాయి వర్షం కురిసింది.
- సాధారణం కంటే సీతానగరంలో 132.9 శాతం, నల్లజర్లలో 103.6, దేవరపల్లిలో 102.3 శాతం అధిక వర్షపాతం నమోదైంది.
- జూలై నెలలో సాధారణ వర్షపాతం 209.2 మిల్లీమీటర్లు కాగా, 51.4 శాతం అధికంగా 316.8 మి ల్లీమీటర్లు నమోదైంది. గోకవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం, చాగల్లు మండలాల్లో సైతం సాధారణ స్థాయి కంటే 50 శాతం పైగా అధిక వర్షపాతం నమోదు కావడం విశేషం.

నష్టాల వరద

గడచిన రెండు నెలల్లో కురిసిన అధిక వర్షాలు రైతులను నష్టాల వరదలో ముంచెత్తాయి. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. జూలై నెలలో కురిసిన కుండపోత వర్షాలకు కొవ్వాడ కాలువ, ఎర్ర కాలువ, పేములకాలువ, ఇతర కొండ వాగులు పొంగి ప్రవహించాయి. ఎర్రకాలువ వరదల ప్రభావంతో నల్లజర్ల, నిడదవోలు, ఉండ్రాజవరం మండలాల్లోను, కొవ్వాడ కాలువ వరదకు గోపాలపురం, తాళ్లపూడి మండలాల్లోను పంటలు దెబ్బ తిన్నాయి. దీనికి తోడు గోదావరి వరద కూడా ముంచెత్తడంతో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఈ వర్షాలు, వరదలు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.

అధికారుల లెక్కల ప్రకారం జిల్లావ్యాప్తంగా 14,177 మంది రైతులకు చెందిన 10,879 హెక్టార్లలో వ్యవసాయ పంటలు నీట మునిగి, దెబ్బ తిన్నాయి. జిల్లాలోని 77 గ్రామాల పరిధిలో 1,102 మంది రైతులకు చెందిన 693.17 హెక్టార్లలో ఉద్యాన పంటలకు సైతం నష్టం వాటిల్లింది.

1,481 టీఎంసీలు కడలిపాలు

గడచిన రెండు నెలల కాలంలో సాగు అవసరాలు పోనూ 1,481 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రం పాలైంది. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల్లో సాగు అవసరాల నిమిత్తం జూన్, జూలై నెలల్లో 41.668 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. జూన్‌లో 2.635 టీఎంసీల నీరు సముద్రంలోకి విడిచిపెట్టారు. జూలై నెలలో గోదావరికి అధికంగా వరద రావడంతో ఏకంగా 1,477 టీఎంసీల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద గత నెల 22 నుంచి ఈ నెల రెండో తేదీ తెల్లవారుజాము వరకూ మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి గోదావరి వరద ప్రవహించింది. జూలై 28న ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటి మట్టం గరిష్టంగా 15.80 అడుగులకు చేరింది. అత్యధికంగా 16,14,844 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడిచిపెట్టారు. గోదావరి వరదల ప్రభావంతో తాళ్లపూడి, కొవ్వూరు, పెరవలి, నిడదవోలు, సీతానగరం, కడియం మండలాల పరిధిలో పంటలు ముంపు బారిన పడి దెబ్బ తిన్నాయి.

జిల్లాలో సగటు వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)

నెల	సాధారణం	నమోదు	శాతం
జూన్	117.0	198.3	+69
జూలై	209.2	316.8	+51.4

తోట ముగ్గిపోయింది



రెండెకరాల్లో కర్పూర అరటి సాగు చేశాను. 10 రోజుల్లో మొత్తం తోట తెగిపోతుందనుకున్నాను. ఇంతలోనే వరద వచ్చి మొత్తం పంటను ముంచేసింది. పది రోజులుగా నీటిలో ఉండటంతో తోటంతా ముగ్గిపోయింది. ఏం చేయాలో తెలియడం లేదు.

– వేంద్ర ఏసు, అరటి రైతు, ముక్కామల, పెరవలి మండలం

రూ.50 వేల నష్టం



నాలుగెకరాల్లో వరి ఊడ్చాను. రూ.50 వేలు పైగా పెట్టుబడి అయ్యింది. మూన తిరుగుతున్న సమయంలో కొవ్వాడ కాలువ వరద ముంచెత్తింది. పది రోజుల పాటు వరద నీరు పొలంలోనే ఉండిపోవడంతో పంట మొత్తం కుళ్లిపోయింది. పెట్టుబడి మొత్తం నష్టపోయాను. మళ్లీ నారు తీసుకువచ్చి నాట్లు వేయాల్సి ఉంది. దీనికి మరో రూ.50 వేలు ఖర్చవుతుంది. నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

– మద్దుకూరి దొరబాబు, రైతు, రాగోలుపల్లి, తాళ్లపూడి మండలం



చేను.. ఏరు ఏకమైనట్టు: నిడదవోలు మండలం తాళ్లపాలెం సమీపంలో ఎర్రకాలువ వరద ముంపుబారిన పడిన పంట పొలాలు (ఫైల్)



దుంపనాశనమే..: పెరవలి మండలంలో గోదావరి వరద ముంపులో అరటి పంట (ఫైల్)

ఎర్ర కాలువ ముంచెత్తింది



ఎర్ర కాలువ సమీపంలో ఏడెకరాల పొలం ఉంది. జామ, కొబ్బరి, పనసతో పాటు చెరకు సాగు చేస్తున్నాం. ఏడెకరాల పంటను ఎర్ర కాలువ వరద ముంచెత్తింది. వరద ప్రభావంతో రెండెకరాల జామ తోటలో చెట్లు పూర్తిగా దెబ్బ తిన్నాయి. పొలంలో ఒండ్రు మట్టి మేటలు వేసింది. ప్రభుత్వం పరిహారం చెల్లించాలి.

– కాశీభట్ల రామగోపాలశర్మ, రైతు, అనంతపల్లి, నల్లజర్ల మండలం

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



బహుమతులు పొందిన క్రీడాకారులతో పోటీల నిర్వాహకులు

సామర్లకోట: జాతీయ స్థాయి ఓపెన్ కరాటే పోటీల్లో పెద్దాపురం విద్యార్థులు ప్రతిభ చూపారు. విశాఖపట్నంలో అమరపిని శ్రీనివాస రావు మెమోరియల్ ఆధ్వర్యాన ఆదివారం ఈ పోటీలు జరిగాయి. కాటా, కుమ్మేటీ, టీమ్ కటా కేటగిరీల్లో బాల బాలికలకు ఆయా వయస్సుల వారీగా పోటీలు నిర్వహించారని పెద్దాపురం శిక్షణ శిబిరం నిర్వాహకులు దుంగల పూజిత సూర్యశ్రీ తెలిపారు. ఈ పోటీల్లో మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్ తదితర 9 రాష్ట్రాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారని చెప్పారు. కుమ్మేటీ (ఫైటింగ్) సీనియర్స్ బాలికల విభాగంలో వై.సూర్యకళ బంగారు పతకం, జి.శ్రీలక్ష్మి కాంస్యం, బాలుర విభాగంలో యోగేశ్వర్ రజతం, జూనియర్ విభాగంలో డి.నిఖిల రజతం, యు.కీర్తి కాంస్య పతకాలు సాధించారని వివరించారు. కాటా సీనియర్స్ బాలికల విభాగంలో వై.సూర్యకళ బంగారు, జి.శ్రీలక్ష్మి కాంస్య, ఎస్.జశ్విత కాంస్య, బాలుర విభాగంలో సాయి బంగారు, యోగేశ్వర్ రజత పతకాలు, జూనియర్ బాలికల విభాగంలో ఐ.రోహిత బంగారు, డి.నిఖిల రజిత, యు.కీర్తి కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. బాలుర విభాగంలో పి.లోకేష్ బంగారు, కె.విరాజ్ కాంస్య, సబ్ జూనియర్స్ బాలికల విభాగంలో బి.లతిక బంగారు, యు.సాహిత కాంస్య, బాలుర విభాగంలో ఎస్.సతీష్, పి.పూర్ణభాస్కర్ కాంస్య పతకాలు గెలుచుకున్నారని వివరించారు.

అక్రమ తొలగింపులు ఆపాలి

- రాజకీయ వేధింపులు మానాలి
- కూటమి ప్రభుత్వంపై చిరుద్యోగుల ఆగ్రహం
- కలెక్టర్ వద్ద ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కీం వర్కర్లు


సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాజకీయ వేధింపులకు, అక్రమ తొలగింపులకు పాల్పడటాన్ని నిరసిస్తూ స్కీమ్ వర్కర్లు బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, యానిమేటర్లు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు మానాలని, అక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులు పెద్ద సంఖ్యలో మండుటెండలో నిరసన తెలిపారు.

రాజకీయ అక్రమ తొలగింపులే..

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నేటి వరకూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వివిధ రంగాల కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ రాజకీయ అక్రమ తొలగింపులేనని అన్నారు. దీనికి చట్టబద్ధత లేదని, ఈ చిరుద్యోగులను కక్షతో తొలగిస్తూ, వారి స్థానంలో కొత్తవారిని నియమించి లక్షల రూపాయలు దండుకోవాలని కొందరు స్థానిక నాయకులు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. అరకొర వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో అనేక సంవత్సరాలుగా పని చేస్తున్నా కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించకుండా వేధించడం, బలవంతంగా తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కొత్త ప్రభుత్వం తమనేదో ఉద్ధరిస్తుందని ఆశలు పెట్టుకుంటే మొత్తానికే బయటకు గెంటివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు రాజకీయ పార్టీల నాయకులు కాదని, విధి విధానాలతో ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారని, ఐదేళ్లకోసారి రాజకీయ నేతలు మారిపోయినట్టు తమను మార్చడం చట్టబద్ధం కాదని స్పష్టం చేశారు. అక్రమ తొలగింపులు వేధింపులపై సంబంధిత శాఖల అధికారులు మౌనంగా ఉండడం సరికాదని, ఏ ఒక్క ఉద్యోగిని తొలగించరాదని అరుణ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ మూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి పూర్ణిమరాజు, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి జువ్వాల రాంబాబు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ మాణిక్యాంబ, ప్రధాన కార్యదర్శి వై.బేబీరాణి, కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, ఏపీ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు చిట్టా బేబీ పాల్గొన్నారు.

ఇసుక మాయం!

- ఉసులుమర్రులో కరిగిపోతున్న గుట్టలు
- గత నెల 9నాటికి 33,065 టన్నుల నిల్వలు
- ఈ నెల 4 వరకూ విక్రయించినది 16,338 టన్నులు
- ఇంకా ఉండాల్సింది 16,727 టన్నులు
- ఉన్నది 10 వేల టన్నులేనని అంచనా
- 6 వేల టన్నులు పైగా ఇసుక ఏమైనట్టో!
- మైనింగ్ అధికారుల లెక్కకు.. ఉన్న ఇసుకకు కానరాని పొంతన



నాడు కొండలా..: విక్రయాలకు ముందు ఉసులుమర్రులో భారీగా ఉన్న ఇసుక గుట్ట



నేడు కరిగేనిలా..: సోమవారం నాటికి మిగిలిన ఇసుక



ఉసులుమర్రులో ఇసుక కోసం క్యూలో ఉన్న జనం

పెరవలి: కొండలా ఉండే ఇసుక గుట్ట క్రమంగా కరిగిపోయింది.. అమ్మింది కొంత.. అమ్ముకున్నది కొంత.. ఎగరేసుకుపోయింది మరికొంత.. ఈ క్రమంలో పెద్ద మొత్తంలో ఇసుక మాయమైందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. అధికారులు చెబుతున్న లెక్కలకు.. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవానికి పొంతన కుదరకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. దీనికి సంబంధించిన వివరాలివీ..

గోదావరి వరదలు, భారీ వర్షాల సమయంలో ఇసుకకు కొరత రాకూడదనే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో పెరవలి మండలం ఉసులుమర్రు వద్ద భారీగా ఇసుక నిల్వ చేశారు. గత నెల 9వ తేదీకి ముందు ఇక్కడ జిల్లా మైనింగ్ అధికారులు లెక్కలు వేసి, 33,065 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నట్లు ప్రకటించారు. ఆమేరకు లిఖితపూర్వకంగా రాసి స్థానిక అధికారులకు అప్పగించారు. అనంతరం ఇక్కడ గత నెల 9న ఇసుక అమ్మకాలు ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ నెల 4వ తేదీ వరకూ ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్ద 16,338 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయించినట్లు డిప్యూటీ తహసీల్దార్ సన్నిబాబు తెలిపారు.

ఇంత వరకూ బాగానే ఉన్నా అసలు కథ ఇక్కడే మొదలైంది. అధికారుల లెక్కల ప్రకారం చూస్తే ఇక్కడ ఇంకా 16,727 మెట్రిక్ టన్నుల ఇసుక ఉండాలి. కానీ, వాస్తవంగా అంత కనిపించడం లేదు. ఉన్న ఇసుక సుమారు 10 వేల టన్నులు మాత్రమే ఉంటుందని ఇక్కడి అధికారులు తాజాగా అంచనాకు వచ్చారు. మిగిలిన 6,727 మెట్రిక్ టన్నుల ఇసుక ఏమైందనేది తెలియక.. ఉన్నతాధికారులు అడిగితే ఏం చెప్పాలో తెలియక స్థానిక అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న ఇసుక నిల్వలు నాలుగైదు రోజులు మాత్రమే వస్తాయని స్థానిక లారీ డ్రైవర్లు, అధికారులు చెబుతున్నారు. ఇక్కడ రోజుకు 100 నుంచి 110 లారీల (12 నుంచి 20 టన్నుల సామర్థ్యం) వరకూ ఇసుక ఎగుమతులు జరుగుతున్నాయి. ఉన్న ఇసుక 500 లారీలకు మాత్రమే సరిపోతుందని తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయం జిల్లా ఉన్నతాధికారులకు చెప్పగా.. ఏమాత్రం తేడా వచ్చినా అందుకు స్థానిక అధికారులదే బాధ్యత అని వారు స్పష్టం చేయడంతో ఏం చేయాలో తెలియక హడలెత్తుతున్నారు. ఒకవేళ స్థానిక అధికారులు కక్కుర్తి పడి, ఈ 25 రోజుల్లో 50 లారీల ఇసుక అక్రమంగా తరలించేశారని అనుకున్నా సుమారు 1,000 టన్నుల ఇసుక తేడా రావాలి. కానీ, ఏకంగా 6,727 టన్నుల తేడా రావడం స్థానిక అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. మొదట్లో మైనింగ్ అధికారులు రెండు రోజులు కొలతలు వేసి, మరో మూడు రోజులు లెక్కలు కట్టిన తర్వాతే ఇసుక నిల్వలను ప్రకటించారు. దీంతో వారి లెక్కలు సరిగ్గానే ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ లెక్కలు, అమ్మకాల మధ్య ఇసుక ఏమైందో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. ఇసుక నిల్వల వద్ద రాత్రి సమయాల్లో ఎవరూ కాపలా లేకపోవటంతో అర్ధరాత్రులు అక్రమార్కులు ఇసుక తరలించుకుని పోయి ఉంటారని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా ఉసులుమర్రులో మాయమైన ఇసుక ఎవరిని బలి తీసుకుంటుందోననే ఆందోళన స్థానిక అధికారులు, సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో ప్రస్తుత విద్యా సంవత్సరానికి (జూలై 2024 సెషన్)కు వివిధ దూరవిద్యా కోర్సులతోపాటు ఆన్‌లైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 14వ తేదీ వరకూ గడువు పొడిగించారు. ఈ విషయాన్ని ప్రభుత్వ అటానమస్ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ ఎంఆర్ గౌతమ్ సోమవారం తెలిపారు. వైద్య విద్యార్థులకు హెల్త్ అండ్ న్యూట్రిషన్ కోర్సు, లీగల్ ప్రాక్టీస్‌లో ఉన్నవారికి వివిధ చట్టాలకు సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులు, ఉపాధ్యాయులకు అనువైన కోర్సులు ఇగ్నో అందిస్తోందని ఆయన తెలిపారు. ఎంబీఏలో రెండు కొత్త కోర్సులు ప్రారంభించారని, అవి ఇంజినీరింగ్ చేసిన వారికి ఉపాధి కల్పించేవిగా ఉంటాయన్నారు. అలాగే గృహిణులకు వీలైన ఎన్నో కోర్సులను ఇగ్నో అందిస్తోందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి భగవద్గీతలో పీజీ కోర్సు అందుబాటులోకి వచ్చిందన్నారు. యూజీసీ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఒకేసారి రెండు డిగ్రీలను చేయవచ్చని, ఒకటి రెగ్యులర్ మోడ్లో మరొకటి డిస్టెన్స్ లెర్నింగ్ లేదా ఆన్‌లైన్ మోడ్లో చేయవచ్చని ఆయన తెలిపారు. విశ్వ విద్యాలయం అందిస్తున్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ డిప్లొమా, డిగ్రీ, అన్ని పీజీ కోర్సుల్లో ప్రవేశాలు ఆగస్టు 14 వరకూ లభిస్తాయన్నారు. ఇగ్నో వెబ్‌సైట్‌లో http://ignouadmission.ramarth.edu.in/ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు.

దారి దోపిడీ కేసులో నిందితులకు జైలు

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలో పలు దోపిడీలకు పాల్పడిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఆలమూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. స్థానిక ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కథనం ప్రకారం.. దారి దోపిడీకి పాల్పడుతున్న ఆరోపణలపై 2023 అక్టోబర్ 30న పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని సంజీవ్ గాంధీనగర్‌కు చెందిన గుబ్బల మోషే, రాజమహేంద్రవరానికి చెందిన పొడుగు శివను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వాదోపవాదాలు జరగ్గా నేరం నిర్ధారణ కావడంతో ఆ ఇద్దరికీ మూడేళ్ల జైలు, రూ.పది వేల జరిమానా విధిస్తూ జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్ తీర్పు వెలువరించారు.

యువకుడి ఆత్మహత్య

కొత్తపల్లి: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. యండపల్లి గ్రామానికి చెందిన వై.సుధీర్(27) తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గత కొద్ది రోజులుగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. దీని కారణంగా మనస్తాపానికి గురైన సుధీర్ ఇంటి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై కొత్తపల్లి పోలీసులను వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

చీరకాలం గుర్తుండిపోయేలా..

- 'జాంధానీ'తో సరికొత్త ఒరవడి
- నైపుణ్యంతో చరిత్ర లిఖిస్తున్న చేనేత కార్మికులు
- రేపు జాతీయ చేనేత దినోత్సవం





జంధానీ చీరలు నేస్తున్న నేత కార్మికుడు

పిఠాపురం: చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టించారు.. తమకంటూ గుర్తింపు పొందారు.. కాకినాడ జిల్లాలో చేనేత కార్మికులు చరిత్ర లిఖించారు. జాంధానీ చీరల రూపకల్పనతో ప్రత్యేక ముద్ర వేశారు. అనతి కాలంలోనే అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించారు.

బుధవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం ఇది. ఉప్పాడ కాటన్, సిల్క్‌కు గతంలో పేటెంట్ హక్కు, ఇండియన్ హ్యాండ్ లూమ్స్‌లో స్థానం సంపాదించి ముందడుగు వేయగా జాంధానీ చీరల డిజైన్లతో కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ పోస్టల్ కవర్ విడుదల చేసింది. దీంతో ఉప్పాడ చేనేత కళాకారుల జాంధానీ చీర ప్రత్యేకతను చాటింది. ప్రభుత్వ చేయూతతో కుటీర పరిశ్రమగా ప్రారంభమైన జాంధానీ చీరల తయారీ నేడు ప్రపంచ స్థాయి గుర్తింపునకు నాంది పలుకుతుంది. ఏటా రూ.కోట్ల విలువైన క్రయ విక్రయాలు జరుగుతున్నాయి. కొత్త అందాలను తెచ్చే జాంధానీ సోయగాలు మగువల మనసును ఇట్టే దోచుకుంటున్నాయి. ఇరువైపులా ఒకే విధంగా కనిపించే ఈ చీరలకు రానురాను గిరాకీ పెరుగుతోంది. ఒక కొత్తపల్లి మండలం కొత్తపల్లి, కుతుకుడుమల్లి, వాకతిప్ప, అమీనాబాద్, ఉప్పాడ, మూలపేట, గొల్లప్రోలు మండలం తాటిపర్తి తదితర గ్రామాల్లో గతంలో 50 వరకూ ఉండే మగ్గాలు నేడు 800 వరకూ చేరుకున్నాయి. వీటిని అన్నికులాల వారూ తయారు చేస్తున్నారు. వీటి తయారీలో ఎక్కువగా చిన్నపిల్లలు ఆరితేరుతున్నారు.

జిల్లా పరిధిలో ఇలా..

కాకినాడ జిల్లాలో ప్రత్తిపాడు, గొల్లప్రోలు, ఉప్పాడ చేనేత క్లస్టర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మొత్తం 2,300 కుటుంబాలు జీవిస్తుండగా, మొత్తం 3,300 మగ్గాల వరకూ ఏర్పాటు చేశారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో నేతన్నలకు స్వర్ణయుగమని చెప్పాలి. అప్పట్లో చేనేతలకు వివిధ పథకాల కింద జమ చేసిన ఆర్థిక సహాయం రూ.32.66 కోట్లు కాగా, చేనేత పరికరాలకు రూ.2 కోట్లు అందజేసింది. జిల్లాలో చేనేత సహకార సంఘాలు 18 ఉండగా, సభ్యులుగా 2,500 మంది ఉన్నారు. సహకారేతర రంగంలో 2 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. జిల్లాలో చేనేత సహకార సంఘంలో వివిధ వస్త్రాల ఉత్పత్తి విలువ రూ.83.58 లక్షలు కాగా అమ్మకాలతో రూ.165.90 లక్షలు వచ్చింది. ఉప్పాడ జాంధానీ చీరలకు గత వైఎస్సార్ ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు కిందట రూ.10 లక్షలు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కింద బంగారు పతకం అందించింది.

మరింత సహకారం అవసరం



ఉప్పాడ జాంధానీ చీరల తయారీ కార్మికులకు మరింత ప్రోత్సాహం అందించాలి. ముఖ్యంగా వర్షాకాలంలో మగ్గాల్లోకి నీరు వస్తుంది. ఆ సమయాల్లో నేత ఆగిపోతుంది. అలాంటి పరిస్థితులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లు నేయడానికి తగిన సామగ్రి ఇవ్వాలి. చేనేత సొసైటీలను బలోపేతం చేయాలి.

–లొల్ల వీర వెంకట సత్యనారాయణ, మాస్టర్ వీవర్

చేతి నిండా పని



ప్రస్తుతం చేనేతకు పని చేతినిండా ఉంటోంది. జాంధాని చీర నేసేటప్పుడు ఎక్కడా లూజు లేకుండా చాలా దృఢంగా నేయాలి. అడ్డు, నిలువు పట్టు ధారాలనే ఉపయోగించాలి. ప్రతి జాంధాని చీర నేయడానికి ముగ్గురు నుంచి నలుగురు కార్మికులు అవసరమవుతారు. ఒక్కో చీర డిజైన్‌ను బట్టి 20 రోజుల నుంచి 40 రోజుల సమయం పడుతుంది.

–శీలామంతుల రాంబాబు, నేత కార్మికుడు, కొత్తపల్లి

జాతీయ స్థాయిలో వన్నె తెచ్చారు



కాకినాడ జిల్లాలో కార్మికులు చేనేతకు జాతీయ స్థాయిలో వన్నె తెచ్చారు. కేంద్రం ఏ అవార్డు ప్రకటించినా అది జాంధానీకి వచ్చి తీరుతుందంటే అంతా మన నేత కార్మికుల గొప్పదనమే. కొన్నేళ్లుగా ఆన్‌లైన్‌లో ఈ చీరల వ్యాపారం పుంజుకొంది. రానున్న రోజుల్లో మరింత పెరగనుంది. జిల్లాలో కొత్త విధానాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాం. అరటి నారతో చీరలు నేయడంపై శిక్షణ ఇచ్చాం.

–కె.పెద్దిరాజు, జిల్లా చేనేత జౌళి శాఖాధికారి, కాకినాడ

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తులకు జైలు

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసులో పలువురికి శిక్ష విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. ఆ వివరాల్లో వెళ్తే.. కాకినాడ ట్రాఫిక్–1, 2, టూ టౌన్, త్రీ టౌన్, పోర్ట్, తిమ్మాపురం, కరప, ఇంద్రపాలెం, సామర్లకోట పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌లపై వెళ్తుండగా పలువురిపై కేసులు నమోదు చేశారు. సోమవారం వారిని కోర్టులో హాజరుపర్చగా 8 మందికి రెండు రోజుల జైలుశిక్ష, 60 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

- అలాగే మద్యం తాగి బైక్ నడిపిన కేసులో ఏడుగురికి జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు. తాళ్లరేవు మండలం కోరంగి, గొల్లపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో మద్యం తాగి బైక్‌పై వెళ్తుండగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

భార్యను హత్య చేసిన వ్యక్తి అరెస్ట్

ధవళేశ్వరం: భార్యను హత్య చేసిన భర్తను ధవళేశ్వరం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం వీరభద్రనగర్‌కు చెందిన ధనాల మహేష్ కొంత కాలంగా కుటుంబంతో కలసి ధవళేశ్వరంలోని టిడ్కో గృహాల వద్ద నివాసం ఉంటున్నాడు. 2017లో మహేష్‌కు యర్నాకుల శ్యామలతో ప్రేమ వివాహం జరిగింది. కొంత కాలం నుంచి భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. పెద్దలు పలుమార్లు రాజీ చేశారు. శుక్రవారం రాత్రి భార్యతో తిరిగి గొడవ పడిన మహేష్ తొలుత చేతులో కొట్టి మంచం కింద ఉన్న సిమెంట్ రాయిని తీసుకొని తలపై కొట్టడంతో అపస్మారక స్థితిలోకి చేరుకుంది. శ్యామలను ఆసుపత్రిలోకి చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్యామల సోదరుడు గెద్దాడ మణికంఠ ఫిర్యాదు మేరకు ధవళేశ్వరం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం మహేష్‌ను అరెస్ట్ చేశారు. కడియం సీఐ పి.తులసీధర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో సిబ్బందిపై వేటు

అవకతవకల నేపథ్యంలో చర్యలు

కొవ్వూరు: ప్రభుత్వ మద్యం దుకాణంలో మద్యం పక్కదారి పట్టించిన వ్యవహారంలో నలుగురు సిబ్బందిని శాశ్వతంగా విధుల నుంచి తొలగించారు. ఈ విషయాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ (అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి) వైవీవీ లక్ష్మణస్వామి తెలిపారు. కొవ్వూరులోని పెట్రోల్ బంక్ ఎదురుగా ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యవహారంపై ఈ నెల 4న 'రాత్రయితే చేతివాటమే' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై విచారణ చేశారు. అసిస్టెంట్ రిటైల్ అవుట్‌లెట్ మానిటరింగ్ అధికారి లక్ష్మణస్వామి, రిటైల్ అవుట్‌లెట్ వెరిఫికేషన్ ఆఫీసర్ ఆర్.ఆంద్రూస్‌లు సోమవారం విచారణ చేసి అవకతవకలను గుర్తించారు. తొమ్మిది రకాల మద్యం బ్రాండ్‌లకు గాను 79 బాటిళ్లు స్కానింగ్ చేయలేదని తేలింది. ఈ మద్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా నిబంధనలను అతిక్రమించినందుకు సేల్స్ సూపర్‌వైజర్ కె.సత్తిపండు, సేల్స్‌మెన్లు బి.రాహుల్, ఎస్.స్వామిలను విధుల నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద మరో ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్న చినబాబు దుకాణం మూసివేసిన తర్వాత పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న దుకాణంలో మద్యం కొనుగోలు చేసుకుని తీసుకెళ్లడం నేరంగా పరిగణించి అతన్ని సైతం శాశ్వతంగా విధుల నుంచి తొలగించారన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. సొమ్ము కాజేసి

- ఐ.పంగిడిలో సంఘటన
- బాధితుడు జైళ్ల శాఖ రిటైర్డు ఉద్యోగి



ఐ.పంగిడిలో ఏటీఎం కార్డు మార్చి సొమ్ము కాజేసిన వ్యక్తి

కొవ్వూరు: ఏటీఎంలో సొమ్ము తీసుకునేందుకు వెళ్లిన ఓ విశ్రాంత ఉద్యోగిని ఓ కేటుగాడు మోసగించాడు. ఏటీఎం కార్డు మార్చేసి రూ.33,500 కాజేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఐ.పంగిడికి చెందిన జైళ్ల శాఖ రిటైర్డ్ ఉద్యోగి రేలంగి నారాయణరావు పింఛన్ సొమ్ము డ్రా చేసుకునేందుకు శనివారం ఆ గ్రామంలోని ఒక ఏటీఎంకి వెళ్లారు. ఇందులో సొమ్ము రాకపోవడంతో బయటకు వచ్చేశారు. పక్కనే ఓ కేటుగాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో సొమ్ములు వస్తున్నాయని చెప్పి ఏటీఎంకి తీసుకుచ్చాడు. సొమ్ము తీసుకునే క్రమంలో పక్కనే ఉన్న ఆ కేటుగాడు సహాయ పడుతున్నట్టు నటించి నారాయణరావు ఏటీఎం కార్డు పిన్ నంబర్‌ను చూశాడు. తర్వాత ఏటీఎం కార్డు తీసుకుని తొలుత బ్యాలెన్స్ బటన్ నొక్కి సొమ్ము ఎంత ఉన్నాయో చూశాడు. దీనిని బాధితుడు ప్రశ్నించడంతో పొరపాటున విత్‌డ్రా బటన్‌కి బదులు బ్యాలెన్స్ బటన్ నొక్కినట్లు చెప్పాడు. ఈ సమయంలో నారాయణరావు ఏటీఎం కార్డుని మార్చేసి వేరే కార్డు ఆయన చేతిలో పెట్టారు. డూప్లికేట్ కార్డు ద్వారా సొమ్ము డ్రా చేసే ప్రయత్నం చేసినప్పటికీ సొమ్ము రాకపోవడంతో బ్యాంకుకు వెళ్లండని చెప్పి ఆ కేటుగాడు అక్కడి నుంచి మోటారు సైకిల్‌పై ఉడాయించాడు. సొమ్ము రావడం లేదని నారాయణరావు ఇంటికి వచ్చేశారు. కొద్దిసేపటి తర్వాత చాగల్లు ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.20 వేలు, మరో అర గంటలో నిడదవోలు ఏటీఎం నుంచి రూ.13,500 సొమ్ము తీసుకున్నట్లు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో నారాయణరావు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడంతో రూ.33,500 డ్రా చేసుకున్నట్లు రావడంతో బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల్లో నిందితుడి ఫోటోను గుర్తించి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నన్ను ఇండియాకు తీసుకెళ్లండి..

- అబుదాబి నుంచి వీధివారిలంక మహిళ ఆవేదన
- సామాజిక మాధ్యమాల్లో సెల్ఫీ వీడియో



సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంటున్న జ్యోతి

కపిలేశ్వరపురం: మండలంలోని కేదారిలంక శివారు వీధివారిలంకకు చెందిన కాశి జ్యోతి తనను ఇండియాకు తీసుకెళ్లండి అంటూ వేడుకుంది. సుమారు ఆరు నెలల కిందట అబుదాబికి వెళ్లిన ఆమె పని ఒత్తిడి పెరగడంతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సెల్ఫీ వీడియోలో పేర్కొంది. ఆ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తుంది. జ్యోతి భర్త చంద్రశేఖర్ (బాబులు) వీధివారిలంక దళితవాడలో నివాసముంటున్నారు. వేడుకలకు లైటింగ్, సౌండ్ సిస్టం పనులు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆర్థిక సమస్యల నుంచి బయట పడేందుకు జ్యోతి పి.గన్నవరానికి చెందిన ఓ ఏజెంట్ ద్వారా అబుదాబికి వెళ్లింది. అక్కడ అరబ్ షేక్ ఇంట్లో పనికి కుదిరింది. తనకు అబుదాబిలో ఆహారం లభ్యం కావడం లేదని, అనారోగ్యం పాలైన సంగతి చెప్పినా యజమానులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తనను ఇండియాకు తీసుకెళ్లాలంటూ కన్నీటి పర్యంతం అయ్యింది.

రారండోయ్.. వేడుక చూద్దాం

- నేడు సత్యదేవుని ఆవిర్భావ ఉత్సవాలు
- రత్నగిరిపై ఆధ్యాత్మిక శోభ



స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: అన్నవరానికి ఆధ్యాత్మిక శోభ వచ్చింది.. మంగళవారం జరిగే సత్యదేవుని 134వ (సత్యవిదియ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు శ్రావణ శుద్ధ పాడ్యమి సోమవారం అంకురార్పణ జరిగింది. ఉదయం పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి స్వామివారి జయంత్యుత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ వేడుకల్లో రెండ్రోజులు జపతపాలు నిర్వహించే 40 మంది రుత్విక్కులకు దీక్షా వస్త్రాలను దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ అందజేశారు. స్వామి, అమ్మవార్లకు దాత, శ్రీలలితా రైస్ ఇండస్ట్రీ అధినేతల్లో ఒకరైన మట్టే సత్యప్రసాద్ పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి జయంతి ఉత్సవం సందర్భంగా మంగళవారం వాటిని స్వామి, అమ్మవారికి అలంకరించాలని కోరారు.

మార్మోగిన రత్నగిరి

స్వామివారి జయంతి వేడుకలను పురస్కరించుకుని రుత్విక్కుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనివేటి మండపంలో సుమారు 50 మంది రుత్విక్కులు జపాలు, పారాయణలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఆస్థాన వేదపండితులు గొల్లపల్లి ఘనపాఠి, గంగాధర గంగబాబు, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, అర్చకులు ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, కంచిభట్ల రామ్‌కుమార్, సుధీర్, వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, కల్యాణ బ్రహ్మ చామర్తి కన్నబాబు, వ్రత పురోహితులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్యవిదియ పూజలు



సత్యదేవుడు, అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దాత మట్టే సత్యప్రసాద్




ఉత్సవమూర్తుల వద్ద దాత మట్టే సత్యప్రసాద్ సమర్పించిన వజ్ర కిరీటం, కర్ణాభరణాలు

సత్యదేవుని 134వ 'సత్యవిదియ' (ఆవిర్భావ దినోత్సవం) సందర్భంగా మంగళవారం సత్యదేవుడు, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నారు. తెల్లవారు జామున రెండు గంటలకు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం దాత మట్టే సత్యప్రసాద్ స్వామి, అమ్మవార్లకు చేయించిన వజ్రకిరీటాలు, వజ్ర కర్ణాభరణాలు, నూతన పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఏడు గంటల నుంచి భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. ఉదయం 11 గంటలకు అనివేటి మండపంలో ఆయుష్యహోమం పూర్ణాహుతి జరుగుతుంది. అనంతరం వెండి రథంపై స్వామి, అమ్మవార్ల ఆలయ ప్రాకారంలో ఊరేగిస్తారు. వేద పండిత సత్కారంలో భాగంగా పండితులను సత్కరిస్తారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

సత్యదేవుడు, అమ్మవారిని గరుడ వాహనంపై మంగళవారం సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకూ గ్రామ వీధుల్లో ఘనంగా ఊరేగిస్తారు. ఇందులో భక్తులు, దేవస్థానం సిబ్బంది సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొనాలని ఈఓ ఆదేశించారు. ఇదిలా ఉంటే సత్యదేవుని ఆలయం, రాజగోపురాలు, రామాలయం, ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలు, పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

సొంతింటి కల తీర్చేందుకు క్రెడాయ్ హోం ఎక్స్‌పో



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న క్రెడాయ్ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: సామాన్యుల సొంతింటి కల నెరవేర్చేందుకు క్రెడాయ్ (ది కన్ఫడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) రాజమహేంద్రవరం చాప్టర్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13, 14, 15 తేదీల్లో రాజమహేంద్రవరం చెరుకూరి గార్డెన్స్‌లో క్రెడాయ్ హోం ఎక్స్‌పో 2024ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బుడ్డిగ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు ఈ ఎక్స్‌పో దోహదపడుతుందన్నారు. ఇందులో గృహ నిర్మాణానికి అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్రెడాయ్ రాజమహేంద్రవరం చాప్టర్ చైర్మన్ సూరవరపు శ్రీనివాసకుమార్, ప్రెసిడెంట్ మన్యం ఫణికుమార్, జనరల్ సెక్రటరీ చల్లా మురళి, ట్రెజరర్ టీవీఎల్ నరసింహారావు, పూర్వపు అధ్యక్షుడు కర్రి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలని ధర్నా



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: పీబీ దేవం గ్రామానికి చెందిన దళిత యువకుడు చాపల అజయ్‌కుమార్‌పై హత్యాయత్నం చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేపూడి శ్యామ్‌బాబు ఆధ్వర్యంలో సామర్లకోట పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువకుడిపై దాడి జరిగి 60 గంటలు దాటినా నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కంటే ముందు నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తుంటే, విచారణ చేస్తున్నామని చెప్పడం వింతగా ఉందన్నారు. అజయ్‌కుమార్ చేతులు కట్టి చిత్రహింసలకు గురి చేశారన్నారు. చట్టాలను ఎవరికి వారే చేతిలో తీసుకుంటే పోలీస్ స్టేషన్లు ఎందుకని ఆయన ప్రశ్నించారు. సంఘటన జరిగిన తరువాత పీబీ దేవం గ్రామానికి వచ్చిన డీఎస్పీ, పోలీసుల దృష్టికి జరిగిన సంఘటనను తల్లిదండ్రులు చాపల లక్ష్మి, సత్తిబాబులు తీసుకు వెళ్లారన్నారు. ప్రస్తుతం తిరిగి స్టేట్‌మెంట్ ఇవ్వాలని కోరడం ఏంటన్నారు. పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వారితో డీఎస్పీ లతాకుమారి చర్చలు జరిపారు. ఇప్పటికే కొంత మందిని అదుపులోకి తీసుకున్నామని, మరి కొంతమందిని అరెస్ట్ చేయడానికి రెండు టీమ్‌లు తిరుగుతున్నాయని ఆందోళనకారులకు డీఎస్పీ చెప్పారు. సమయం ఇస్తే అందరినీ అరెస్ట్ చేస్తామన్నారు. దాంతో 24 గంటలు వేచి చూస్తామని ఆందోళన కారులు చెప్పి నిరసన విరమించారు. ఐక్యవేదిక నాయకులు కాళ్ల లక్ష్మీనారాయణ, వల్లూరి నాని, గొడత విజయకుమార్, కాపవరపు కుమార్, మందపల్లి సత్యనారాయణ, రవి ఆధ్వర్యంలో ఈ ఆందోళనలో జరిగింది.